కెపాసిటర్ బాక్సుల ఏర్పాటు

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: టీఎస్‌ఎన్‌పీడీసీఎస్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో కెపాసిటర్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వినియోగదారులకు కన్స్యూమర్ ఎండ్ లోవో ల్టేజీ ఇంప్రూవ్‌మెంట్‌లో భాగంగా 23 2ఎంవీఏఆర్ కెపాసిటర్ బాక్సు లను మూడు కోట్ల రూపాయలతో ఏర్పాటుచేశామన్నారు.టీఅండ్‌డి ఇంప్రూ వ్‌మెం ట్‌లో భాగంగా 308 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు.185 ఓవ ర్ లోడెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించామన్నారు. మార్చి నెల లో విని యోగదారులకు నిరంతరం విద్యుత్ అందించాలని జారీ చేశామని తెలిపారు.

మెరిసిన తెల్ల బంగారం

● రికార్డు స్థాయిలో క్వింటాల్‌కు రూ. 7,400



జమ్మికుంట మార్కెట్‌కు వచ్చిన పత్తి

జమ్మికుంట, ఫిబ్రవరి 28: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో తెల్ల బంగారం ఒక్కసారిగా మెరిసింది. ఈ సీజన్‌లో పత్తికి అత్యధికంగా క్వింటాల్‌కు 7400 రూపాయలు పలకడం ఇది ప్రథమం. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం మార్కెట్ యార్డులో అత్యధికంగా 7,500 రూపాయలు పలుకగా, జమ్మికుంట మార్కెట్లో 7400 రూపాయలు పలికి రెండో స్థానంలో నిలిచింది. ప్రతి ఏటా అక్టోబర్ నుంచి ఇక్కడ పత్తి కొనుగోళ్లు ప్రారంభం అవుతాయి. ప్రారంభ సమయంలో క్వింటాల్ ధర 6,200 రూపాయలు మాత్రమే పలికింది. దీంతో రైతులు నిరాశ చెందారు. ఆ సమయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రంగ ప్రవేశం చేసింది. 8 నుంచి 12శాతం వరకు తేమ ఉన్న పత్తికి మద్దతు ధర 7,020 నుంచి 6,712 రూపాయల వరకు చెల్లించి కొనుగోళ్లు చేపట్టింది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్లో బేళ్లు, గింజల ధరలు పెరుగడంతో వ్యాపారులు పోటీ పడి పత్తి కొన్నారు. పక్కనే ఉన్న వరంగల్ వ్యవసాయ మార్కెట్లో పత్తి ధర 7,100 రూపాయలు పలికింది. జమ్మికుంటలో క్వింటాల్ రూ.300 అధికంగా పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన పత్తి ధరలు నిలకడగా ఉంటాయా, మళ్లీ తగ్గుతాయా అనే అయోమయంలో రైతులు ఉన్నారు. ఇప్పటికే పత్తి అమ్ముకున్న రైతులు ప్రస్తుతం పెరుగుతున్న ధరలు చూసి కొంత నిరాశకు గురవుతున్నారు

నేడు బీజేపీ ఎంపీ అభ్యర్థుల తొలి జాబితా

- కరీంనగర్ అభ్యర్థిగా 'బండి' పేరు ప్రకటించే అవకాశం
- పెద్దపల్లి అభ్యర్థి తేలేది మలిజాబితాలోనే...
- ప్రజాహిత యాత్రకు బ్రేక్.... ఢిల్లీకి వెళ్లనున్న సంజయ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి నిలుపనున్న అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ గురువారం విడుదల చేసే అవకాశమున్నది. బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ, పార్లమెంటరీ బోర్డు సమావేశాలు ఢిల్లీలో గురువారం జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీకి నిలుపనున్న పార్టీ అభ్యర్థుల విషయంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. తన పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజాహిత యాత్రను నిర్వహిస్తున్న కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ యాత్రకు బ్రేక్ ఇచ్చి ఢిల్లీకి వెళ్తున్నారు. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానికి హాజరుకావడానికి ఢిల్లీ రావలసిందిగా పార్టీ జాతీయ నాయకత్వం నుంచి పిలుపురావడంతో ఆయన యాత్రకు ఒకరోజు బ్రేక్ ఇచ్చి ఢిల్లీకి వెళ్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం బీజేపీకి నలుగురు ఎంపీలు ఉండగా ఆదిలాబాద్ ఎంపీ విషయంలో మినహా మిగతా ముగ్గురి స్థానాలను పదిలం చేస్తూ పార్టీ నాయకత్వం ఇదివరకే ఒక అవగాహనకు వచ్చిందని, గురువారం జరుగనున్న సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడిస్తుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. కరీంనగర్ స్థానం నుంచి బండి సంజయ్‌కుమార్ మళ్లీ పోటీచేయడం ఖాయమని, గురువారం ఆయన అభ్యర్థిత్వాన్ని తొలి జాబితాలోనే ప్రకటిస్తారని పార్టీవర్గాలు అంటున్నాయి. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం విషయంలో అభ్యర్థి ఎవరన్నది రేపటి సమావేశంలో తేలకపోవచ్చని, మలి జాబితాలోనే అభ్యర్థిని ప్రకటిస్తారని తెలిసింది. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించగా, కాంగ్రెస్ ఇంకా ఈ విషయంలో నిర్ణయం తీసుకోలేదు. బీఆర్ఎస్, బీజేపీ ఇప్పటికే నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీశ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ ప్రచారాన్ని కూడా నిర్వహిస్తున్నారు.

తొమ్మిది మంది సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28: పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్-1 పరిధిలో 65 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని సీసీఆర్‌బీ సీఐ జి మొగిలిని ఊట్నూర్ సీఐగా బదిలీ చేశారు. వరంగల్‌లో పనిచేస్తున్న సీఐ రమేష్‌ను కరీంనగర్ రెండో టాణా సీఐగా నియమించారు. కరీంనగర్ టూటౌన్ సీఐ వెంకటేశ్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీ చేశారు. కరీంనగర్ త్రీటౌన్ సీఐ వి శ్రీనివాస్‌ను సీఎస్‌బి-2కు, సీఎస్‌బి-2 సీఐ బిల్ల కోటేశ్వర్‌ను టాస్క్‌ఫోర్స్-1 సీఐగా, టాస్క్‌ఫోర్స్ -1 సీఐ వెంకటనర్సయ్యను సీసీఆర్‌బి సీఐగా, వెయిటింగ్‌లో ఉన్న వై చంద్రశేఖర్‌గౌడ్‌ను కరీంనగర్ త్రీటౌన్ సీఐగా, వరంగల్‌లో పనిచేస్తున్న పులి వెంకట్‌ను హుజురాబాద్ రూరల్ సీఐగా, హుజురాబాద్ రూరల్ సీఐ బి సంతోష్‌కుమార్‌ను మల్టీజోన్-1 ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మొదటి రోజు ఒకరి డీబార్
- 568 మంది విద్యార్థులు గైర్హాజరు
- ఒక్క నిమిషం నిబంధనతో పరుగుపెట్టిన విద్యార్థులు
- పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మొదటి రోజు నిర్వహించిన ఫస్ట్ ఇయర్ సెకండ్ లాంగ్వేజ్ (తెలుగు, సంస్కృతం, అరబిక్, హింది, ఉర్దూ) పరీక్షలకు 17,564 మంది విద్యార్థుల హాజరు కావలసి ఉండగా 16,996 మంది పరీక్షలు రాశారు. 568 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 15,852 మంది విద్యార్థులకుగాను 389 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో మొత్తం 1,712 మంది విద్యార్థులు రాయాల్సి 1533 మంది పరీక్షలు రాశారు. 179 మంది గైర్హాజరయ్యారు. హుజురాబాద్‌లోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో ఒక విద్యార్థి మాస్ కాపీయింగ్ చేస్తుండగా పట్టుకుని డీబార్ చేశారు. జిల్లాలో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించారు. కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ, పోలీసు, రెవెన్యూ, విద్యాశాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు విద్యార్థులు గంట ముందు నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పలుచోట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కొన్ని ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులను పరీక్షా కేంద్రాల వద్దకు తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ పరీక్షా కేంద్రాల వరకు బస్సులను నడిపించింది. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని, మంచినీటి వసతి, లైటింగ్ వంటి ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్సు కేంద్రాలను మూసివేసి 144 సెక్షన్‌ను అమలు చేసి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమిషం ఆల స్యంగా వస్తే పరీక్షకు అనుమతించ బోమని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ హెచ్చరించిన నేపథ్యంలో విద్యార్థులు 8.30 గంటల వరకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కొంతమంది విద్యార్థులు చివరి నిమిషాల్లో ఉరుకులు పరుగులతో పరీక్ష కేంద్రాలకు వెళ్లారు.

● ప్రశాంతంగా పరీక్షలు రాయాలి..

ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గదుల్లో విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఏమైనా సమస్యలున్నాయా... వసతులు ఎలా ఉన్నాయంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, నిర్లక్ష్యంగా ఉండవద్దని, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

● ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28: ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను ఒక యజ్ఞంలా భావించి ప్రజలు పూర్తిగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఫిలింభవన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించు కుని ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల జరిగే నష్టాలు, దుష్పలితాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయి నాటక ప్రదర్శన పోటీలను నిర్వహించారు. పర్యావరణ, అటవీ, శీతోష్ణస్థితి మంత్రిత్వ శాఖ, జాతీయ హరితదళం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను వాడవద్దన్నారు. దీనిపై విద్యార్థుల్లో చైతన్యం రావాలని, తల్లిదండ్రులకు ప్లాస్టిక్ కవర్లను వాడవద్దని విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల నుంచి మార్పు వస్తేనే ఏదైనా సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలోని 30 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు నాటక ప్రదర్శన పోటీలకు హాజరయ్యారు.కార్యక్రమంలో డీఈవో జనార్ధన్‌రావు, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, హరితదళం ప్రాజెక్టు ఆఫీసర్ బి.విద్యాసాగర్, న్యాయ నిర్ణేతలు గాజుల రవీందర్, రాదండి సదయ్య, స్వదేశ్‌కుమార్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ అందరికీ స్ఫూర్తి ప్రదాత

● ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 28: బంజారాలకు ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ అందరికీ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా సప్తగిరికాలనీలోని సేవాలాల్ మందిర స్థలంలో నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ ధైర్యానికి మారుపేరు అని, దేశం కోసం బంజారాలు ప్రాణత్యాగాలు చేశారని అన్నారు. సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను భావిత రాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, చింతకుంట ఎంపీటీసీ తిరుపతి నాయక్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ నాయకులు లక్‌పతినాయక్, భాస్కర్ నాయక్, డీటీ నాయక్, భీమాసాహెబ్, తిరుపతి, రాజునాయక్, రవినాయక్, సంతోష్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28: పోలీస్ స్టేషన్లకు వచ్చిన వివిధ రకాల ఫిర్యాదులపై ఎస్‌హెచ్‌వోలు సత్వరమే స్పందించాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో బుధవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో నమోదైన కేసుల పురోగతి, సైబర్ క్రైం నియంత్రణ, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు, నాన్ బెయిముల్ వారెంట్ల ఎగ్జిక్యూషన్‌లపై సీపీ పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల వివరాలను స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు.నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు నిరంతరం కొనసాగించాలన్నారు. సమావేశంలో అడిషనల్‌డీసీపీరాజు,లక్ష్మినారాయణ,అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా 'లహరి'

స్లీపర్, సీటింగ్ సౌకర్యం.. బెంగుళూరుకు రోజుకు మూడు బస్సులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 28: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నది. ప్రైవేటుకు దీటుగా స్లీపర్ కమ్ సీటింగ్ బస్సులను లహరి పేరిట దూర ప్రాంతాలకు నడిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపిస్తున్న లహరి ఏసీ స్లీపర్ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. కరీంనగర్ రీజియన్‌లో 11 ఆర్టీసీ డిపోలు ఉండగా కరీంనగర్-1, గోదావరి ఖని నుంచి బెంగుళూరుకు రోజు మూడు ట్రిప్పులను ఆర్టీసీ నడిపిస్తున్నది. గోదావరిఖనికి కేటాయించిన రెండు బస్సుల్లో ఒకటి గోదావరిఖని నుంచి కరీంనగర్ మీదుగా బెంగుళూరుకు, బెంగుళూరు నుంచి కరీంనగర్ మీదుగా గోదావరిఖనికి నడిపిస్తున్నారు.



లహరి బస్సులో బెర్తులు

● డైనమిక్ ఫేర్ సిస్టం

తెలంగాణరాష్ట్రరోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన లహరి బస్సుల్లో డైనమిక్ ఫెయిర్ సిస్టంను అమలు చేస్తు న్నారు.



ఈ బస్సుల్లో 20 బెర్తులు, 22 సీట్లు ప్రయాణికుల కోసం ఏర్పాటు చేశారు. లహరి ఏసీ స్లీపర్ బస్సుల్లో బెర్తులతో పాటు, కూర్చుండే విధంగా సీట్లు ఉన్నాయి. సీట్లను బట్టి ధరలు నిర్ణయించి ప్రయాణికులకు అను వుగా అందు బాటులోకి తెచ్చారు. ముందు వైపు బెర్తుకు 2310 రూపా యలు, మధ్య బెర్తుకు 2230, వెనక బెర్తుకు 2020 రూపాయలు, సీట్లకు 1420 రూపా యలుగా చార్జీలు నిర్ణయించారు.



లహరి బస్సులో లగ్జరీ సీట్లు

● దూర ప్రాంతాలకు మరిన్ని బస్సులు పెంచాలి

లహరి ఏసీ స్లీపర్ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తుండడంతో దూర ప్రాంతాలకు మరిన్ని స్లీపర్ బస్సులను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. కరీంనగర్ నుంచి ముంబాయి, షిర్డి, తిరుపతి, చెన్నై వంటి నగరాలకు లహరి బస్సులను నడిపించాలని ప్రయాణికులు అంటున్నారు.

● సమయాలు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపిస్తున్న లహరి ఏసీ స్లీపర్ బస్సులను ప్రతిరోజు సాయంత్రం నడిపిస్తున్నారు. కరీంనగర్ నుంచి బెంగుళూరు (మర్థాలి)కి రోజు వారీగా లహరి బస్సులు నడుస్తున్నాయి. కరీంనగర్ డిపో బస్సులు సాయంత్రం 5.30, 6.00కు బయలుదేరతాయి. గోదావరిఖనిలో సాయంత్రం 5.45 నిమిషాలకు బయలు దేరి కరీంనగర్‌కు రాత్రి ఏడు గంటలకు చేరుకుంటుంది. కరీంనగర్ డిపోకు చెందిన రెండు బస్సులు బెంగుళూరులో రోజు సాయంత్రం 5.30, 6.00 గంటలకు బయలు దేరి కరీంనగర్ చేరుకుంటాయి. గోదావరిఖనికి చెందిన బస్సు సాయంత్రం 6.30 నిమిషాలకు బెంగుళూరులో బయలుదేరి కరీంనగర్ మీదుగా గోదావరిఖనికి చేరుకుంటుంది.

మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ ముస్తాబాద్ మండలానికి చెందిన లకావత్ శ్రీరామ్ అనే వ్యక్తి ఓ బాలికను వేధించిన విషయంలో ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో ఫోక్సో కేసు నమోదైంది. ఆ కేసు కోర్టులో పెండింగ్ ఉన్నందున, లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తి కేసు రాజీపడేలా మాట్లాడి పంచాయతీ చేస్తానని అన్నాడన్నారు. ఇందుకు లకావత్ శ్రీరామ్‌ను రూ. 1.80 లక్షలు డబ్బుల ఇవ్వాలని, డబ్బులు ఇస్తే కేసు రాజీ చేస్తానని డిమాండ్ చేసాడన్నారు. అతని డిమాండ్ మేరకు రూ 1.80 లక్షలు లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తికి ఇచ్చాడన్నారు. ఆ డబ్బులు తీసుకొని పంచాయతీ చేయలేదని లకావత్ శ్రీరామ్ లకావత్ చిన్న మున్నాపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చిన్నమున్నానాయక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భూకబ్జా కేసుల్లో మరో ఐదుగురిపై కేసు

● పలువురు కార్పొరేటర్ల భర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28: భూవివాదాలు సృష్టించి అక్రమంగా భూమి యజమానుల వద్ద నుంచి డబ్బులు దోపిడీకి పాల్పడటమే కాకుండా నిర్మాణాల కూల్చివేతకు పాల్పడిన ఐదుగురు నిందితులపై కరీంనగర్ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బుధవారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ వివేకానందపురి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మామిడి రవీందర్‌రెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబరు 240ఏలో 744.97 చ.గ. స్థలాన్ని 2004 సంవత్సరంలో గోపడి సుగుణమ్మ, గోపడి రాజుల వద్ద కొనుగోలు చేశాడు. 2017లో గ్రామపంచాయతీ అనుమతితో ప్రహరీ, షెడ్ నిర్మించుకున్నాడు. ఇదే సర్వే నంబరులోని మూల అరుణాదేవి 26 ప్లాట్లు ఇంటిస్థలాలను విక్రయించగా వివిధ ప్రాంతాలకు చెందినవారు కొనుగోలు చేశారు. అయితే ఒక్కో ఇంటి స్థలం నుంచి 3 లక్షల రూపాయల వంతున ఇవ్వాలని రవీందర్‌రెడ్డిని కార్పొరేటర్ భర్త కాశెట్టి శ్రీనివాస్ బెదిరించాడు. అడిగిన డబ్బులు ఇవ్వనందున వారి ప్లాట్లకు వెళ్లే 40 అడుగుల రోడ్డు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అక్కడ శ్మశానవాటికగా స్థానికులను ప్రోత్సహించి అక్కడే శవాలను ఖననం చేయిస్తున్నారు. 2019జనవరి 2న కార్పొరేటర్ భర్త ఎడ్ల అశోక్, మాజీ వార్డు సభ్యుడు అల్లిబిల్లి నగేష్‌తో కలిసి రవీందర్‌రెడ్డి నిర్మించిన ప్రహరీ, షెడ్, గేట్‌లను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేయించారు.

కార్పొరేటర్ల భర్తలైన ఎడ్ల అశోక్, కాశెట్టి శ్రీనివాస్, తుల బాలయ్యలు రవీందర్‌రెడ్డిని పిలిపించి అక్కడి ప్లాట్ల యజమానులు ఒక్కొక్కరు రూ. 3 లక్షలు ఇవ్వాలని లేదంటే అక్కడే శ్మశానవాటికను నిర్మిస్తామని బెదిరించారు. దీంతో రవీందర్‌రెడ్డితో పాటు రాజమౌళి, రఘుపతిరెడ్డి తలా లక్ష రూపాయలు ఎడ్ల అశోక్‌కు ముట్టజెప్పారు. మిగతావారు డబ్బులు ఇవ్వలేదని 2020లో శివరాత్రి సమ్మయ్య ద్వారా ఎక్స్‌కావేటర్‌తో రోడ్డుపై గుంతలు తీయించారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కరీంనగర్ రూరల్ ఠాణాలో ఐపీసీ సెక్షన్ 386, 452, 457, 506, 120-బి రెడ్‌విత్ 34 కింద నిందితులు ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. నిందితులు కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అరెస్టు చేసి కరీంనగర్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ప్రస్తుతానికి వారికి 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇవ్వాలని న్యాయమూర్తి సూచించినట్లు పోలీసులు తెలిపారు.

మహా శివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలి

● రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ● వేములవాడలో జాతర ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్


ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 28: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్చి 7,8,9వ తేదీలలో జరుగునున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలను ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేములవాడలో బుధవారం నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహా శివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని, శాస్త్రపరంగా స్వామి వారి పూజలు ఘనంగా జరగాలని, భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా మార్చి 7 నుంచి మార్చి 9 వరకు వేములవాడకు ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, మహాలక్ష్మి పథకం నేపథ్యంలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీ ఆధారంగా ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన మార్గాలలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, పొలాలలో రైతుల సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్ల పక్కన ఉన్న బావులకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కనిపించకుండా మూడు షిఫ్టులలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రత్యేక దర్శనానికి రూ.300 రుసుం

మహాశివరాత్రి జాతర సందర్భంగా గతంలో అందించే ప్రత్యేక పాసులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నామని, వాటి స్థానంలో ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. జాతర అనంతరం వేములవాడ క్షేత్రాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికబద్ధంగా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వేములవాడలో సైతం బ్రేక్ దర్శనం అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దాతల సహాయంతో భక్తుల కోసం 500 గదులతో అతిథి గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొం దించాలని, దాతలకు కల్పించే సదుపాయాల అంశంలో శ్రీశైలం, తిరుపతిలో అవలంబించే విధానాలను అవలంబించాలని మంత్రి పేర్కొన్నారు. ఆలయ నిత్య అన్నదాన సత్రంలో సంఖ్యతో సంబంధం లేకుండా ఎంత మంది భక్తులు వచ్చినా ప్రతినిత్యం అన్నదానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని ఇందుకోసం అవసరమైన నివేదిక రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసే మహాశివరాత్రి జాతరను విజయవంతంగా చేయాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా వేములవాడ పట్టణాన్ని సన్నద్ధం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మంత్రి, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరిం చుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం ఆలయ పరిసరాలు, జాతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎస్పీ నాగేంద్ర చారి, ఆలయ ఈఓ కృష్ణప్రసాద్, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోలపై వేటు

మంథని, ఫిబ్రవరి 28: అక్రమాల ఆరోపణలు, ఫిర్యాదులు, విధుల దుర్వినియోగానికి పాల్పడిన మంథని ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోతో పాటు మరో సూపర్‌వైజర్‌పై జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ వేటు వేశారు. మంథని సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న పద్మశ్రీ, ప్రస్తుతం ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిపై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన డీడబ్ల్యూవో, 26వ తేదీన వరంగల్ ఆర్‌డీజేలు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ మేరకు మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీ విధులు సరిగా నిర్వహించలేదని, ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలు తమ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, కార్యాలయ సమాచారాన్ని బయట పరిచిందని పేర్కొంటూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుంజపడుగు సెక్టార్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహి స్తున్న గండు సరిత ఇన్‌చార్జి సీడీపీవోకు సహకరించిందని పేర్కొంటూ షోకాజ్ నోటీసు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐసీడీఎస్ ఆఫీసులో కొనసాగుతున్న ఫిర్యాదులు, విచారణలకు తాత్కాలికంగా బ్రేక్ పడే అవకాశం ఉంది.

సంఘ బహిష్కరణపై కేసు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 28 : పట్టణంలోని మోచి సంఘం రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గానికి చెందిన మోచి సంఘ కుల పెద్దమనుషులు మరో వర్గానికి చెందిన కుల సభ్యులను సామూహిక సంఘ బహిష్కరణ చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఉమ్మడిగా ఉన్న ఆస్తులను కులానికి చెందిన కొందరు ఆస్తులన్నీ తమవేనని ప్రచారం చేస్తూ మరో వర్గానికి సంఘం నుంచి బహిష్కరించినట్లు ప్రచారం చేస్తూ సంఘం ఆస్తుల్లో భాగస్వామ్యం లేదంటున్నారని సంఘానికి చెందిన కావల్ల పెంటయ్య తండ్రి లింగయ్య, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 28: మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బొలుమాల దేవయ్య(61)బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు దేవయ్య అనారోగ్యంతో పాటు అప్పుల బాధలు భరించలేక వెటర్నరీ సెంటర్‌లోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని కుమారుడు బొలుమాల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కత్తితో తండ్రిపై దాడి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరపేటలో కుటుంబ కలహాలతో తండ్రిపై కత్తితో దాడి చేసిన తనయుడి సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరపేట గ్రామానికి చెందిన రిత్వాం కుమారుడు అయిన అక్బర్‌ఖాన్ కొంత కాలం వివాహం చేసుకున్న తర్వాత వేరు కాపురం పెట్టుకొని ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి అక్బర్ ఖాన్‌కు భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద వెళ్లి ఉంటోంది. అప్పటి నుంచి తాగుడుకు బానిసై నా భార్య నాకు కావాలని అక్బర్‌ఖాన్ బుధవారం తల్లిదండ్రులపై గొడవకు దిగి తల్లిని కత్తితో పొడిచే క్రమంలో తండ్రి రిజ్వాన్‌ఖాన్ అడ్డుగా వచ్చాడు. అడ్డుగా వచ్చిన రిజ్వాన్‌పై దాడికి పాల్పడటంతో గాయపడిన రిజ్వాన్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రిజ్వాన్‌ఖాన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్బర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలి ఆత్మహత్య

మల్లాపూర్, ఫిబ్రవరి, 28: గత తొమ్మిదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జీవనోపాధి నిమిత్తం మండలంలోని రత్నపూర్ గ్రామానికి వచ్చిన పెడికం వెంకటేష్(38) అనే వలస కూలి తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం మల్లాపూర్ పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పెడికం గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

రాముడి జన్మస్థలం గురించి మాట్లాడినట్లు నిరూపిస్తారా?

● బండి సంజయ్ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ మంత్రి పొన్నం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: రాముని జన్మస్థలం ఎక్కడ, రాముని అక్షింతలు ఎక్కడివి అని తాను మాట్లాడినట్లు ఎంపీ బండి సంజయ్ ప్రచారం చేస్తున్నాడని వాటిని సాక్ష్యాలతో నిరూపిస్తే సజీవ దహనానికి కూడా సిద్ధమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పూర్ణాహుతితో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆయనకు ఆలయ అర్చకులు రామాచారి, విజయేంద్ర చారీలు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు శ్రీస్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ర్యాలీలో భాగంగా బండి సంజయ్‌కుమార్ రాముడు జన్మస్థలం ఎక్కడని, రాముని అక్షింతలు ఎక్కడివని అసలు ఈ ఎమ్మెల్యే తన అమ్మకే పుట్టాడా.. అని తన అమ్మను ఉద్దేశించి మాట్లాడిన తీరుపై విరుచు కుపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వున్న తల్లులను, బీజేపీ పార్టీ అధిష్టానాన్ని ఒక్కటే కోరుతున్నానని, బండి సంజయ్ అన్న మాటలకు నా తల్లి రోధిస్తుందని భావోద్వేగానికి లోనయ్యారు. బిడ్డా నా తల్లి గురించి మాట్లాడావు జాగ్రత్త అని హెచ్చరించారు. ఆవేదనతో చెబుతున్న రాత్రంతా నిద్రపోలేదని అన్నారు. మళ్లీ పేపర్లలో, వాట్సప్‌లలో అమ్మ పేరుతో రాజకీయం చేస్తున్నావని నన్నే అంటున్నాడు. నేను నీలాగే రాజకీయాలు చేస్తున్నాను నాకు స్థానిక మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబుతో నాకు రాజకీయంగా శత్రుత్వం ఉంది, కానీ ఏ రోజు కూడా వాళ్ల కుటుంబ సభ్యుల గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు. నేను ఒక హిందువునని, నేను భక్తుడినని, నేను మాత్రం బండి సంజయ్‌లాగా మాంసాహారం తినను అని ఎద్దేవా చేశారు. రాముడి జన్మస్థలం ఎక్కడ అని ప్రచారం చేస్తున్నారు. రాముని జన్మస్థలం గురించి అడిగే మూర్ఖుడు ఉంటాడా అని ప్రశ్నించారు. ఒకవేల నేను అని ఉంటే మీడియా చూస్తూ ఊరుకుంటుందా.. అని గుర్తు చేశారు. రామున్ని ఓట్ల రూపకంలో వాడుకుంటుంది మీరని, రాముని అంశంతో రాజకీయం చేస్తున్న మూర్ఖులు మీరని మండిపడ్డారు. ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. రోడ్లు, ఉపాధి హామీ పనులు తప్ప నిర్మాణాత్మక పనులు ఏమి చేశావో చెప్పాలన్నారు. హిందువునని చెప్పుకునే నీవు ఎంపీగా వేములవాడ క్షేత్రానికి ఏమి చేశావని నిలదీశారు. రాముని పేరుతో రాజకీయం చేసుడు, మత పరమైన అంశాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుని పబ్బం గడుపుతున్నావని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల సమయంలో నేను కూడా హిందువునే, నేను యజ్ఞాలు చేస్తాను, నేను భక్తున్నే వాడేవడు, వీడేవడు, ఈ హిందుగాళ్లు.. బొందుగాళ్లు అని కేసీఆర్ అన్న మాటలను సాకుగా చూపి ఎంపీగా గెలిచావని ఆరోపించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నువ్వు కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు ఓడిపోయిన నువ్వు నన్ను రాజీనామా చేయమంటావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల కమలాకర్‌తో కుమ్మక్కై కావాలని ఎమ్మెల్యేగా ఓడిపోయి మళ్లీ వాడో వీడో అంటూ నోటికి వచ్చిన మాటలు మాట్లాడి సానుభూతి తెచ్చుకోవాలని చూసే నీ రాజకీయ రంగు ప్రజలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. భార్య మంగళసూత్రం విలువ తెలువని నువ్వు నా గురించి మాట్లాడుతావా అంటూ మండిపడ్డారు. వారి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్‌కుమార్ స్థానిక నాయకులు ఉన్నారు.


కొడుముంజలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ భూమిపూజ చేస్తున్న మంత్రి పొన్నం

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లిన పొన్నం ప్రభాకర్ ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌లు కదిరే రాజ్‌కుమార్, పండుగ ప్రదీప్, నాయకులు పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

పని కల్పించాలని రోడ్డెక్కిన పవర్‌లూం నేత కార్మికులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేతన్నలకు పని కల్పించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, ప్రభుత్వ అర్డర్లు తక్షణమే ఇవ్వాలంటూ సిరిసిల్ల నేత కార్మికులు రోడ్డెక్కారు. బుధవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సీఐటీయూ, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అసాముల సమన్వయ కమిటీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. చేనేత విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకోని మానవహారంగా ఏర్పడ్డారు. ధర్నా నిర్వహించి ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని నివారించడంతో పాటు తక్షణమే బతుకమ్మ చీరలు, ప్రభుత్వ అర్డర్లు ఇవ్వాలని పెండింగ్ బకాయిలను సబ్సిడీ డబ్బులు, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్‌లు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఉపాధి లేక పవర్‌లూం కార్మికులు, అసాములు వైపని, వార్పిన్ కార్మికులు, గుమస్తాలు, జాపర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించిందని వాటికి సంబంధించిన బకాయిలు, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా టెస్కోకు చెల్లించాల్సిన రూ 482 కోట్లు చెల్లించలేదన్నారు. సిరిసిల్లకు రూ.200 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పోరాటాలకు కలిసి రావాలన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కార్మికుల కోసం పార్లమెంట్‌లో ఒక్కసారైనా నోరు మెదపలేదని అన్నారు. పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, అసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి తదితరులున్నారు.



సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల ర్యాలీ

ఉద్యోగాల పేరిట రూ. 9 లక్షల టోకరా

- ఇద్దరిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకుల నుంచి గంభీరావుపేట మండలంలో ఇద్దరు వ్యక్తులు రూ.9 లక్షలు వసూలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రవల్లికి చెందిన అర్జున్, గర్జనపల్లికి చెందిన రాజు అనే ఇద్దరు వ్యక్తులు పలు ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిటా ఏడుగురు యువకుల నుంచి రూ.9 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఎలాంటి ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వారి ధ్దరిని నిలదీశారు. గంభీరావుపేట మండలంలోని జగదాం బతండాకు చెందిన అజ్మీరా రమేష్ స్థానిక పోలీస్‌లను ఆశ్రయించాడు. రమేష్ ఫిర్యాదు మేరకు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏడుగురు యువకుల వద్ద ఉద్యోగాల పేరుతో రూ. 9 లక్షలు వసూలు చేసినట్టు రాజు, అర్జున్‌లు ఒప్పుకున్నారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు రాజు, అర్జున్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులు ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తేవాలని ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టాలి

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు ప్రచురించిన కరపత్రాన్ని బుధవారం గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూల్చే కుట్ర పన్నుతోందన్నారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతు చేసి ప్రాజెక్ట్‌ను పునరుద్ధరణ చేపట్టాల్సిన ప్రభుత్వం అసత్య ఆరోపణలతో బీఆర్‌ఎస్‌ను బదనాం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రాజెక్ట్‌గా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఏర్పడిన చిన్న చిన్న సాంకేతిక లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రాజెక్ట్ ప్రతిష్టను మంటగులపుతోందన్నారు. ఓట్ల కోసం రైతుల నోట్లో మట్టి కొట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నిజనిజాలను ప్రజలకు వివరించేందుకు మార్చి 1న చలో కాళేశ్వరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ మధుకర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై రూపొందించిన కరపత్రాన్ని చదివితే పూర్తిగా అర్థమవుతుందన్నారు.కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

అర్హులందరికీ గృహజ్యోతి : ఎస్ఈ

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. లబ్ధిదారులు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఆందోళన చెందవద్దని, అధికారులకు సమర్పించిన దరఖాస్తులు ధ్రువీకరించిన తర్వాత నమోదు చేస్తారన్నారు. అర్హులైన వారందరికీ జీరో బిల్ అందజేస్తామన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్లు వసూలుపై చర్యలు తీసుకోరన్నారు.

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: భూ కబ్జాలకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పెద్దూరు తిరుపతి అనే వ్యక్తిని బుధవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 1996లో తంగళ్లపల్లి మండలానికి చెందిన గజభింకర్ రాధాభాయి 1996లో 20గుంటల భూమిని కొని రిజిస్ట్రేషన్ చేసుకుందన్నారు. ఈ భూమిని పెద్దూరు తిరుపతి అనే వ్యక్తి బెదిరించి ఆక్రమించుకున్నాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతిపై తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. అమాయక ప్రజలను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్టు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో గల్ఫ్ దేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన పెగ్గెర్ల చంద్రశేఖర్ కొనాయపల్లి గ్రామంలో కార్యలయం ఏర్పాటు చేసుకుని అమాయకులను మోసం చేస్తున్నాడని తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల దర్గయ్య అనే వ్యక్తిని ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్‌కు పంపిస్తానని, నెలకు లక్ష జీతం వస్తుందని నమ్మించి రూ.2 లక్షల 75 వేలు తీసుకుని, మోసం చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే మహిళలకు చేయూత

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మహిళలకు ఆదరణ ఉందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి అన్నారు. ప్రభుత్వం రెండు గ్యారెంటీలు ప్రవేశ పెట్టడంతో నగరంలోని తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 500 రూపాయలకే సిలిండర్ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిటి కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు భారతమ్మ, సుశీల, పుష్పలత, పద్మ, దేవేంద్ర, కవిత, జ్యోతి, రజిత, సునీత సమద్, అంజనేయులు, శ్రవణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వైద్య సహాయకురాలిని నియమించండి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమము, స్వాధార్ హోంకు వీలైనంత త్వరగా వైద్య సహాయకురాలిని నియమించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల వసతి గృహాలను ఆయన సందర్శించి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో వైద్య సహాయకురాలు లేరని వారు తెలపడంతో డీఎంహెచ్‌వోతో మాట్లాడి వీలైనంత త్వరగా వైద్య సహాయకురాలిగా నియమించాలని సూచించారు. పట్టణంలోని స్వాధార్ హోంను పరిశీలించి సౌకర్యాల గురించి అందరితో మాట్లాడి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేశ్ పాల్గొన్నారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు, మహిళలకు పండ్లను పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి28: నగరంలోని విద్యానగర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వానమామలై పవన కుమారాచార్యుల వైదిక నిర్వహణలో ఉదయం అధ్యయనోత్సవం జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి దూలూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మడతల మీరయ్య సింగిరెడ్డి రాంరెడ్డి, బానాల మల్లారెడ్డి, కామ అంజిబాబు, ఉప కార్యదర్శులు గడ్డం గోపాల్, గడప సత్యనారాయణ, ఉప కోశాధికారి రుద్రోజు ఉత్తమాచారి, నిర్వహణా కార్యదర్శులు ఊకంటి పాపిరెడ్డి, ఎన్నం మోహన్, సభ్యులు గజవాడ ఆంజనేయులు, బల్మూరి కొండాల్‌రావు, వడ్లూరి వేంకటేశం, పాకాల తిరుపతిరెడ్డి, ఆకారపు రుద్రమ్మ, శ్రీపెరుంబుదూరు పుష్పలత, కొల్లూరి భారతమ్మ, శ్రీరామోజు రాజవీరబ్రహ్మం, సలహాదారులు మోటూరి భూమయ్య, చెన్నమాధవుని ప్రభాకరరాజు పాల్గొన్నారు.

ఎన్‌జీవో సంఘం ఉద్యోగుల సమస్యపై పోరాడుతుంది

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28: ఎన్‌జీవో సంఘం ప్రతి సమస్యపై పోరాడుతుందని టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ టీసీఎన్‌జీవో నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడుతూ 317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ ఉపసంఘానికి టీఎన్‌జీవో పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 317 జీవో వల్ల ఇబ్బందులు పడ్డ ఉద్యోగులందరికీ న్యాయం చేసే దిశగా అడుగులు వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్, కమర్షియల్ టాక్స్ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్‌హుస్సేన్, నూతన జిల్లా అధ్యక్షుడు గుంటి బిక్షపతి, కార్యదర్శి మహ్మద్ సలావుద్దీన్, కోశాధికారి శ్రీనివాస్, మహిళ జేఏసీ చైర్మెన్ ఇరుమళ్ళ శారద పాల్గొన్నారు.

కోనో కార్పస్ వృక్షాలను తొలగించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28: ఊపిరితిత్తుల వ్యాధులు, అస్తమా, బ్లడ్ క్యాన్సర్, మాతృత్వం కోల్పోయేటటువంటి వ్యాధులకు కారణమైన కోనో కార్పస్ వృక్షాలను తొలగించాలని ఎస్ఎఫ్‌డి డిమాండ్ చేసింది. బుధవారం స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఎస్ఎఫ్‌డి రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ కలెక్టరేట్ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి బామండ్ల నందు, జిల్లా హాస్టల్స్ ఇంచార్జి శ్రీవర్ధన్, జిల్లా పార్మసీ ఇంచార్జి సాయి పాల్గొన్నారు.

యువత నిరుపేదలకు అండగా నిలవాలి



పుస్తె మట్టెలను అందిస్తున్న మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి

గంగాధర, ఫిబ్రవరి 28: యువత గ్రామంలోని పేదలకు అండగా నిలవాలని మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గట్టుబూత్కూర్‌లోని నిరుపేదకుటుంబానికి చెందిన పూదరి లావణ్య కూతురు సాత్విక, జాతర గొండతార కుమార్తె రమ్యల వివాహం జరగగా విజేందర్‌రెడ్డి పెళ్లి కుమార్తెలకు పుస్తెమట్టెలను అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత సేవాదృక్పథం కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి, ఫిబ్రవరి 28: రెండు గ్యారెంటీలను అమలు చేసిన సందర్భంగా చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వప్న, నాయకులు కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 28: శ్రీచైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో కరీంనగర్, జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ బోర్డ్‌తో కలిసి ఎన్ఎస్ఎస్ బ్యానర్ కింద రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ కన్వెన్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి, ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ బోర్డ్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటే శ్వర్లు, ప్రొఫెసర్లు నరసింహారావు, సురేందర్‌రెడ్డి, జిల్లా ఏయిడ్స్ నివారణ, నియం త్రణ బోర్డు ప్రొఫెసర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అందజేత

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని రంగాపూర్ గ్రామ బూత్ అధ్యక్షుడు అల్లె రాంబాబు ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుడి కుమార్తె దివ్యాంగురాలు కావడంతో కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బం ది పడగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆ అమ్మాయికి రూ.లక్ష విలువ చేసే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం పంపిణీ చేశారు. బుధవారం మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ వాహనాన్ని ఆమెకు అందజేశారు.

రేపటి నుంచి పశువులకు గాలికుంటు టీకాలు

● పశువైద్యాధికారి విజేందర్‌రావు

సైదాపూర్, ఫిబ్రవరి 28: రైతులు అన్ని రకాల పశువులు, దూడలు, లేగలు, దుడ్డెలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పశువైద్యాధికారి సీహెచ్ విజేందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన గ్రామాల ప్రకారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల షెడ్యూలును విడుదల చేశారు. ఈ మార్చి 1 నుంచి 31 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మార్చి 1న వెన్కేపల్లి, వెన్నంపల్లి, 2న సైదాపూర్, వెన్నంపల్లి, 4, 5న జాగీర్‌పల్లి, లస్మన్నపల్లి, 6న ఘన్‌పూర్, ఆరెపల్లి, 7న వెంకటేశ్వర్లపల్లి, ఆరెపల్లి, 9న ఎలబోతారం, సోమారం, 11న రాములపల్లి, సోమారం, 12న ఎక్లాస్‌పూర్, ఎల్లంపల్లి, 13న గుజ్జులపల్లి, 14న గొడిశాల, రాంచంద్రాపూర్, 15న నల్లరామయ్యపల్లి, 16న దుద్దెనపల్లి, 18,19న ఆకునూర్, 20,21న బొమ్మకల్, 22, 23న పెర్కపల్లి, 25న సర్వాయిపేట, 26, 27న రాయికల్, 28న అమ్మనగుర్తి,29నగుండ్లపల్లి,30,31నరాయికల్‌తండాలో టీకా వేస్తామన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం







మాట్లాడుతున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వేడుకల్లో పాల్గొన్న సెయింట్ జార్జ్ స్కూల్ చైర్మన్ ఫాతిమారెడ్డి, జాన్సన్‌గ్లోబల్‌లో ప్రదర్శనను ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్‌లో అల్ఫోర్స్ సైన్స్ కార్నివాల్ పేరిట నిర్వహించిన సైన్స్ డేకు ముఖ్య అతిథిగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. 250 మంది విద్యార్థులు నమూనాలను రూపొందించారు.

●పారమిత విద్యాసంస్థల్లో చిన్నారులు ప్రదర్శించిన పలు నమూనాలు ఎంతగానో ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వియుఎం ప్రసాద్, వినోద్‌రావు, హనుమంత రావు పాల్గొన్నారు.

●బ్లూబెల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జంగ సునీతామనోహరరెడ్డి పాల్గొన్నారు. ఓవెల్స్ పాఠశాలలో ప్రదర్శించిన వర్కింగ్ మోడల్స్ అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు.

●సిద్ధార్థ విద్యాసంస్థల్లో ఎస్‌సీఐ జోన్-2024 పేరుతో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయగా చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి ప్రారంభించారు.

●వసంత్‌వ్యాలీలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఓ ప్రైవేట్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ స్వరూప బుచ్చిరెడ్డి, కార్పొరేటర్ కాసర్ల ఆనంద్ పాల్గొన్నారు.

●జాన్సన్ గ్లోబల్ పాఠశాలలో అన్వేష్-2020 పేరుతో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ ఊట్కూరి మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్ వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

●హౌజింగ్‌బోర్డ్ కాలనీలోని శ్రీసరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులు 50 సైన్స్ మాడల్స్ తయారు చేశారు. ప్రదర్శనను డాక్టర్ గజవల్లి సాయిబాబా ప్రారంభించారు. కార్యక్రమంలో దుగ్యాల గోపాల్ రావు, వేంకట్ ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీరామ్, మోహన్, బాలకుటీర్ మేనేజర్ గీకురు శ్రీనివాస్, కృష్ణవేణి, పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, పవిత్ర, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి పాల్గొన్నారు. భగత్‌నగర్ రావూస్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈఓ నిధిన్‌రావు, ప్రిన్సిపాల్ రహమాన్ పాల్గొన్నారు.

●**గణేష్‌నగర్:** నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో సైన్స్ డే వేడుకలు రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వైజ్ఞానిక రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, రసాయణ శాస్త్ర విభాగం ఇన్‌చార్జి శ్రీధర్, అధ్యాపకులు, కె భాస్కర్, డాక్టర్ బి మహిపాల్‌రెడ్డి, ఐ గోపి, తదితరులు పాల్గొన్నారు.

●నగరంలోని వాణినికేతన్ పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ రేణుకదేవి, ట్రస్మా ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సైన్స్‌ఫేర్ కో-ఆర్డినేటర్ హన్మంతరావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నీలకంఠం, కిడ్స్‌కేర్ ఇన్‌ఛార్జి సందీప్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సిబిఎస్ఈ), రేకుర్తి, విద్యానగర్ నినోస్ బ్లాక్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్‌జార్జ్ చైర్మన్ పి.ఫాతిమారెడ్డి, ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్ పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని టిడ్రా హైడ్రెన్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులు చంద్రయాన్-3, సోలార్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్, న్యూ క్లియర్ పవర్ ప్లాంట్ తదితర ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహారెడ్డి, కరస్పాండెంట్ ముచ్చ నారాయణరెడ్డి, డైరెక్టర్లు సంజీవరెడ్డి, రమణారెడ్డి, సత్యం, సంతోష్‌రావు, రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి, ఇంజమూరి నరేష్, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కందుకూరి శంకర్ పాల్గొన్నారు.

●**హుజూరాబాద్ రూరల్:** సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వివిఎన్ హనుమకుమార్ పాల్గొన్నారు.

●**శంకరపట్నం:** మొలంగూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హెచ్ఎం నీరజ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●**వీణవంక:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు.కార్యక్రమములో ప్రత్యేకాధికారి లావణ్య, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

●**చొప్పదండి:** మండలంలోని రెవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, లలిత, విజయలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

●చొప్పదండిలోని వీణాదరి స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను కరెస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ ప్రారంభించారు. రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

●**తిమ్మాపూర్:** అలుగునూర్‌లో గల పారమిత వరల్డ్ స్కూల్‌లో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పారమిత పాఠశాలల ఛైర్మన్ ప్రసాదరావు పాల్గొన్నారు.

●**గంగాధర:** జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద విద్యాలయం, గంగాధర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలను ఎంఈవో వేణుకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: నగరంలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కేడీసీసీ బ్యాంకు సిబ్బంది డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కేడీసీసీ బ్యాంకు ఏజీఎం చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ రాజయ్య పాల్గొన్నారు.

నాలా ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 28: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో నాలా ఆక్రమణను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలోని గోపాల్ చెర్వు బయటకు వెళ్లే నాలా ఆక్రమణకు గురవుతున్నదన్న ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని నిర్మాణాన్ని అడ్డుకుని, ఎలాంటి నిర్మాణాలు చేయరాదని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ శంకర్, ఆర్ఐ రజనీకాంత్, కార్యదర్శి ఇదయతుల్లా, గ్రామస్థులు నందు, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమ్మక్క హుండీల లెక్కింపు

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 28: కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో నిర్వహించిన సమ్మక్క జాతర హుండీని బుధవారం లెక్కించారు. భక్తుల నుండి 3,39,354 రూపాయలు, టికెట్ల విక్రయం ద్వారా 27,500రూపాయలు మొత్తం 3,67,154రూపాయల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, డీటీ శంకర్, ఆర్ఐ రజనీకాంత్, కార్యదర్శి ఇదయతుల్లా పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే బండి సంజయ్ విమర్శలు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 28 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఎంపీ బండి సంజయ్ కుమార్ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బుధవారం ఓహోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కుమార్ కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన బీసీ వర్గాల నాయకుడైన మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మళ్లీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. శ్రీరాముడు దేశ ప్రజలందరికీ దేవుడేనని, ఆయన పుట్టుక, అక్షింతల గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్కడా మాట్లాడలేదని స్పష్టం చేశారు. మంత్రి అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుతోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. తనకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీగా పోటీ చేసే అవకాశమిస్తే బండి సంజయ్‌ను ఓడిస్తానని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలోనే లేదని, కాంగ్రెస్‌పార్టీ విజయం ఖాయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి రామిడి రాజిరెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్, నాయకులు మోహన్, అబ్దుల్ రహమాన్, ముద్దం తిరుపతిగౌడ్, తిరుపతిరెడ్డి, అమేర్, జీడి రమేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 28: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ హుజూరాబాద్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే బ్రిడ్జి ఏళ్ల గడుస్తున్నా ఎంపీగా ఉండి ఎందుకు పూర్తి చేయలేదన్నారు. దేవుళ్లను రాజకీయాల కోసం వాడుకోకూడదన్నారు. రాములోరు అంటే అందరికీ దేవుడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం నాలుగు పథకాలను అమలు చేశారన్నారు. మాట ఇస్తే తప్పని పార్టీ కాంగ్రెస్ అన్నారు. మరో రెండు పథకాలను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. దళితబంధు విషయంపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కౌశిక్‌రెడ్డి దళితబంధు రెండో విడత డబ్బులను ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి లక్ష మెజార్టీ ఇస్తామన్నారు. సమావేశంలో పత్తి కృష్ణారెడ్డి, సొల్లు బాబు, గూడూరి స్వామిరెడ్డి, ఎర్ర రమేష్, సారంగపాణి, కొలిపాక శంకర్, రేణుక, చరణ్ పటేల్, కొల్లూరి కిరణ్, రామారావు, సాహెబ్ హుస్సేన్, తౌసీఫ్, విల్సన్, వీరేశం, తిప్పారపు సంపత్, సుంకరి రమేష్, సజ్జు, పొన్నగంటి మల్లయ్య పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని కాంగ్రెస్ కమిటీలు రద్దు

హుజూరాబాద్ నియోజకవర్గంలోని పట్టణ, మండల, గ్రామ, యూత్ కమిటీలను రద్దు చేస్తున్నామని వొడితెల ప్రణవ్ తెలిపారు. త్వరలో కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు హైకమాండ్ ఆదేశాల మేరకు పనిచేయాలన్నారు. భూకబ్జాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్, ఫిబ్రవరి 28 : మానకొండూర్‌లో మండల బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ వద్ద బుధవారం రాస్తారోకో చేసి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ వాఖ్యలను వక్రీకరించి మాట్లాడిన పొన్నం వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్, కంది రాజిరెడ్డి, యాట లక్ష్మారెడ్డి, వెల్మారెడ్డి రాజేందర్‌రెడ్డి, మాజర్ల కోటేశ్వర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో ఒత్తిడి వద్దు : ఎంఈవో

ఇల్లందకుంట, ఫిబ్రవరి 28: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉంటే గొప్ప విజయాన్ని సాధించవచ్చని మండల ఇన్‌చార్జి విద్యాధికారి విడపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సందేశాత్మక సినిమాను ప్రదర్శించిన సందర్భంగా మాట్లాడారు.

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి సైన్స్ కారణం

జమ్మికుంట, ఫిబ్రవరి 28: భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి సైన్స్ కారణం అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి రాజశేఖర్ అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సివి రామన్ జయంతి సైన్స్ దినోత్సవం సందర్భంగా మాట్లాడారు.

దళితబంధులో రూ.300 కోట్ల అక్రమాలు

● ప్రిన్సిపాల్ సెక్రెటరీకి తుమ్మేటి సమ్మిరెడ్డి ఫిర్యాదు



ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేస్తున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 28: హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించిన దళితబంధు పథకంలో రూ.300కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఎన్ శ్రీధర్‌లకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి లిఖిత పూర్వకంగా బుధవారం ఫిర్యాదు చేశారు. 2021లో జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం కోసం రూ.2వేల కోట్లు మంజూరు చేసిందని, 17,600 యూనిట్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.10లక్షల చొప్పున జమచేశారన్నారు. మొదటి విడత కింద కొన్ని యూనిట్లకు రూ.5లక్షలు విడుదల చేశారని, ఇదే అదునుగా భావించిన మధ్యవర్తులు బోగస్ కొటేషన్లు, ఫేక్ జీఎస్టీ నెంబర్లు సృష్టించి రెండు లక్షల వరకు దండుకుని, లబ్ధిదారులకు రూ.3లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అనుచరులు పెద్ద ఎత్తున కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. వాహనాల ధరలకు ఎక్కువ కొటేషన్లు వేసి డెలివరీ సమయాల్లో ఈడిలు, ఎస్సీ కార్పొరేషన్, ఉన్నతాధికారులకు పెద్ద మొత్తంలో ముట్ట చెప్పారని తెలిపారు. సీఐడి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలతో విచారణ జరిపి, ఆర్ఆర్ రెవెన్యూ చట్టం ఉపయోగించి మధ్యవర్తులు, కంపెనీల నుండి రీకవరీ చేసి, తిరిగి లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయాలని పేర్కొన్నారు.

కొత్తపల్లి వైస్ ఎంపీపీగా తిరుపతి నాయక్

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 28: కొత్తపల్లి వైస్ ఎంపీపీగా చింతకుంట ఎంపీటీసీ తిరుపతినాయక్ ఎన్నికయ్యారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి డీఆర్‌డీవో శ్రీధర్ ఎన్నికను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, ఎంపీడీవో ప్రభు, ఎంపీఓ శ్రీనివాస్, ఎంపీటీసీలు దావ కమలమనోహర్, పండుగ గంగవ్వనర్సయ్య, కో-ఆప్షన్ సభ్యుడు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

●భూక్య తిరుపతి నాయక్‌ను మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ రెడ్డవేణి మధులు అభినందించారు.

తీగలగుట్టపల్లి పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 28: ఆల్టర్నేట్ టు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు రెండవ బహుమతులు వచ్చాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి నేషనల్ గ్రీన్ కాప్స్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో డ్రామాలో విద్యారులు రెండు వేల రూపాయల బహుమతిని గెలుచుకున్నారు. సింగిల్ మోనో యాక్షన్‌కు తొమ్మిదవ తరగతి విద్యార్థి మహిమాన్విత రెండు వేల రూపాయల బహుమతి గెలుచుకున్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు కరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా టైలర్స్ డే

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక మేరు సంఘం కార్యాలయంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేక్, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ మేరు కులస్తులకు ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆవేదన చెందారు. వస్త్ర పరిశ్రమలోకి కార్పొరేట్ సంస్థలు రంగ ప్రవేశం చేయడంతో టైలర్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి బతుకులు మరింత దుర్భరంగా మారాయని ఆవేదన చెందారు. మేరు కులస్తులకు ప్రభుత్వం టైలర్లు, వడ్డీ లేని రుణాలు, నివేశనస్థలాలు, ఇళ్లను కేటాయించి ఆదుకోవాలని కోరారు.

●**గణేష్‌నగర్:** బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మేరు సంఘం యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మంతెన కిరణ్, మాడిశెట్టి శ్రీనివాస్, గూడూరి రమేష్, కనుకుల కిషోర్, కాశిరాములు, నర్సింగం శీలం అజయ్, కిరణ్, సంజీవ్, సన్ని, శ్రీనివాస్, సుప్రీం టైలర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంకటహార చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 28: నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం భక్తులు భక్తి శ్రద్ధలతో సంకటహార చతుర్థి పూజలను నిర్వహించారు. పాతబజార్ గౌరీశంకర, కమాన్‌రోడ్ రామేశ్వర, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, జ్యోతీనగర్ హనుమాన్ సంతోషిమాత, చైతన్యపురి మహాశక్తి, భగత్‌నగర్ అంజనాద్రి, జెడ్‌పి క్వార్టర్స్‌లోని అయ్యప్ప, అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి, శ్రీరాంనగర్ గణేశ ఆలయాల్లో జరిగిన అభిషేక అర్చనల్లో, హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.

●కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 28: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని శ్రీదుర్గాభవాని దేవాలయంలోని లక్ష్మీగణపతి దేవాల యంలో సంకష్టహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకంపై అవగాహన

హుజూరాబాద్/హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామంలో పురుగుల మందుల వాడకంపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నవక్రాంతి రైతు ఉత్పత్తి దారుల సంస్థ బీసీఐ ప్రాజెక్టు సమన్వయ కర్త సురికొంటి రజిత మాట్లాడుతూ రైతులు పురుగుల మందు స్ప్రే చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

● సైదాపూర్ : రైతులు క్షేత్ర ప్రదర్శన చేసి పురుగుల ఉధృతి ఎక్కువైనప్పుడే ఆ పురుగుకు సంబంధించిన ఒకే రకమైన మందు పిచికారి చేయాలని, రెండు లేదా అంత కన్నా ఎక్కువ రకాల పురుగు మందులు కలిపి స్ప్రే చేయరాదని నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వారి బిసిఐ ప్రాజెక్టు సమన్వయకర్త సాయి కిరణ్ సూచించారు. బుధవారం ఎక్లాస్‌పూర్‌లో పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఎక్కువ పురుగు మందులు కలిపి పిచికారి చేయడం వల్ల ఖర్చు పెరగడంతో పాటు శత్రు పురుగులు రోగ నిరోధకశక్తి పెంచుకుంటాయన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

గంగాధర, ఫిబ్రవరి 28: సీఎం రేవంత్‌రెడ్డి 5వందలకే సిలిండర్, 200 వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు గంగాధరలో సంబరాలు జరుపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట సంధ్య, నాయకులు రాజిరెడ్డి, రోమాల రమేష్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

వీణవంక,ఫిబ్రవరి28:మండలంలోని ఎల్బాక గ్రామంలో ప్రణవ ఆశ్రమంలో గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28 : హుజూరాబాద్ టైలర్స్ సంక్షేమ సంఘం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షులుగా రాయబారపుర రజనీకాంత్, ఉపాధ్యక్షులుగా సొల్లు రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ శంకర్, సహాయ కార్యదర్శిగా పోగు శ్రీనివాస్, కోశాధికారిగా చీకెటి గడెశ్‌లు ఎన్నికయ్యారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం

మానకొండూర్, ఫిబ్రవరి 28 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

జడ్పీటీసీపై బీజేపీ నాయకుల ఫిర్యాదు

చిగురుమామిడి, ఫిబ్రవరి 28: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌పై స్థానిక జడ్పీటీసీ గీకురు రవీందర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని బుధవారం బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బండిరాజేశ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, జిల్లా నాయకులు అచ్చ రవీందర్, పైడిపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

టేకుర్తి వాసికి గోల్డ్ మెడల్

ఇల్లందకుంట, ఫిబ్రవరి 28: మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన మాదాసు మొగిలి జర్నలిజంలో గోల్డ్ మెడల్ సాధించి, గవర్నర్ చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. మాదాసు మొగిలి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సు పూర్తి చేశారు.

సైన్స్ దినోత్సవం

గన్నేరువరం: మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు చేపట్టారు.